

నుదిటిపై మోదీ అని రాసుకుని, మోదీ బొమ్మతో కూడిన కళ్లద్దాలు ధరించి సభలో నినదిస్తున్నయువకుడు

హాజరైన జనం

అమిత్‌షా

కేంద్ర హోంమంత్రి రాకతో బీజేపీ శ్రేణుల్లో జోష్.. కాస్త సమయమే ఉన్నా తనదైనశైలిలో ప్రసంగం

- రెండు గంటలు ఆలస్యంగా సభా వేదికకు..
- 8 నిమిషాలపాటే సందేశం.. వెంటనే తిరుగుపయనం
- మెదక్‌లో గెలిపించి మోదీకి సహకరించాలని పిలుపు
- బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలపై రఘునందన్ ఫైర్
- సహారా బాధితులతో సభలో గందరగోళం


ప్రసంగిస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

ఆంధ్రజ్యోతి ప్రతినిధి/సిద్దిపేట క్రైం, ఆంధ్రజ్యోతి, ఏప్రిల్ 25 : పార్లమెంటు ఎన్నికలలో భాగంగా గురువారం సిద్దిపేటలో నిర్వహించిన బీజేపీ విశాల జన సభ కార్యక్రమం ఆ పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది. బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరై తనదైన శైలిలో ప్రసంగించి కాషాయ దళానికి ఉత్సాహం అందించారు. మెదక్ బీజేపీ అభ్యర్థిగా ఉన్న రఘునందన్‌రావును గెలిపించి మోదీ మూడోసారి ప్రధాని అయ్యేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల అవినీతిపై ధ్వజమెత్తారు. సిద్దిపేట వేదిక సాక్షిగా ముస్లిం రిజర్వేషన్లు తొలగించి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రకటించారు. పదునైన మాటలతో సిద్దిపేట నుంచే తెలంగాణ ఎన్నికల ప్రచారాన్ని అమిత్ షా వేడెక్కించారు.

ఇలా వచ్చి.. అలా వెళ్లారు

ఉదయం 12 గంటలకే అమిత్‌షా సిద్దిపేట సభకు రావాల్సి ఉంది. కానీ పలు కారణాలతో ఆయన రెండు గంటలు ఆలస్యంగా చేరుకున్నారు. అప్పటికే పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు ఆయన రాకకోసం ఎదురు చూశారు. ఓవైపు మండుటెండలు, ఉక్కపోత ఉండగా మరోవైపు అమిత్‌షా ఆలస్యంగా రావడంతో సభలో ఒకింత నిరుత్సాహం ఆవహించింది. తుదకు అమిత్‌షా రాగానే ఒక్కసారిగా ఉత్సాహం పెల్లుబికింది. 1.56 గంటలకు వేదికపైకి వచ్చీరాగానే మైకు అందుకున్నారు. మెదక్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావును తన పక్కన నిలబెట్టుకొని ప్రసంగించారు. కేవలం 8 నిమిషాల్లోనే సందేశం ముగించారు. అయితే ఆ కాస్త సమయంలోనే బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల అవినీతిని కడిగిపారేశారు. మరోసారి మోదీ సర్కార్ రావాలని పదేపదే కార్యకర్తలతో మమేకమవుతూ మాట్లాడారు. తనదైన మాటలు, నినాదాలతో ఉత్సాహం నింపారు. ఆ వెంటనే తిరుగు పయనమయ్యారు. సభలో సహారా ఇండియా బాధితులు ఫ్లకార్డులతో నిరసన తెలిపారు.





అభివాదం చేస్తున్న అమిత్‌షా, రఘునందన్‌రావు, ఈటల రాజేందర్, మాట్లాడుతున్న రఘునందన్

రేవంత్‌రెడ్డి దుబ్బాకకు రా..

- నేను, నా తల్లిదండ్రులు ఏ గడీలో ఉంటున్నామో చూడు
- నాలుగు పార్టీలు మార్చిన వ్యక్తి నీలం మధు
- మెదక్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు

తనను గడీల దొర అంటూ మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దుబ్బాకకు రావాలని రఘునందన్‌రావు సవాల్ విసిరారు. తాను, తన తల్లిదండ్రులు ఎలాంటి గడీల్లో ఉంటున్నామో వచ్చి చూడాలని అన్నారు. అధికారంలోకి వచ్చిన అతి తక్కువ వ్యవధిలోనే రేవంత్‌రెడ్డి ఒక నయవంచకుడిగా మారారని విమర్శించారు. అడ్డూఅదుపు లేని హామీలు ఇచ్చి మళ్లీ పార్లమెంటు ఎన్నికల్లో ఓట్ల కోసం అడ్డగోలుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. నాలుగు పార్టీలు మార్చి, పటాన్‌చెరులో కాంగ్రెస్ అభ్యర్థినే ఓడగొట్టిన నీలం మధుకు ఓట్లు పడవని అన్నారు. ఇక అధికార పెత్తనంతో భూములు గుంజుకొని ఎన్నో కుటుంబాలను హింసించిన వెంకట్రామారెడ్డి చరిత్ర అందరికీ తెలుసన్నారు. ఎంగిలి చేత్తో కూడా సాయమందించని ఆయన రూ.100 కోట్ల నిధిని ఎలా ఏర్పాటు చేస్తారని సందేహించారు. ఎన్నికలు కాగానే సిద్దిపేట నుంచి అయోధ్యకు రైలు సౌకర్యం ఉండేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. భారతీయులమని గర్వపడేలా చేసిన నరేంద్రమోదీ ప్రధాని కావాలంటే తనను గెలిపించాలని అభ్యర్థించారు.

అంతకుముందు బీజేపీ రాష్ట్ర ముఖ్యనేతలు ప్రేమేందర్‌రెడ్డి, ఆకుల విజయ, సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల బీజేపీ అధ్యక్షులు గంగాడి మోహన్‌రెడ్డి, గడ్డం శ్రీనివాస్, గోదావరి అంజిరెడ్డి ప్రసంగించారు.

పాపం ప్రవీణ్‌రెడ్డి



- చివరి వరకు వచ్చి చేజారిన ఎంపీ టికెట్
- గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదే పరిస్థితి
- 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కమ్యూనిస్టులకు కేటాయింపుతో పోటీకి దూరం

హుస్నాబాద్, ఏప్రిల్ 25 : హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే, ములుకనూర్ సహకార బ్యాంకు చైర్మన్ అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ టికెట్లు వచ్చినట్లే వచ్చి చివరి నిమిషంలో చేజారుతున్నాయి. కరీంనగర్ ఎంపీకి పార్టీ టికెట్ వస్తుందని ఆశించిన ఆయనకు నిరాశే ఎదురైంది. తనకు టికెట్ వస్తుందనే నమ్మకంతో బుధవారం ఆయన అనుచరుడు ప్రవీణ్‌రెడ్డి తరఫున నామినేషన్ కూడా వేశారు. చివరి దశలో ఈ టికెట్‌ను వెలిచాల రాజేందర్‌రావుకు కేటాయించడంతో ప్రవీణ్‌రెడ్డి వర్గీయులు నైరాశ్యంలో పడ్డారు. గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ ప్రవీణ్‌రెడ్డికి ఇదే పరిస్థితి ఎదురైంది. అప్పుడు ప్రస్తుత ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు హుస్నాబాద్ నియోజకవర్గం టికెట్ ఖరారు చేయడంతో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసే అవకాశాన్ని కోల్పోయారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో హుస్నాబాద్ కాంగ్రెస్ టికెట్ కోసం ప్రవీణ్‌రెడ్డి, ప్రభాకర్‌గౌడ్ తీవ్రంగా పోటీ పడ్డారు. ఎవరికి వారే ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ప్రచార రథాలను కూడా సిద్ధం చేసుకున్నారు. చివరికి పొన్నం ప్రభాకర్‌కు టికెట్ ప్రకటించడంతో పోటీకి దూరమయ్యారు. కాగా 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కూడ ప్రవీణ్‌రెడ్డికి టికెట్ విషయంలో ఇలాగే చుక్కెదురైంది. అప్పుడు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ప్రచారం పూర్తి చేసి నామినేషన్ వేసే క్రమంలో కాంగ్రెస్, సీపీఐ పొత్తుల్లో భాగంగా ఈ సీటును సీపీఐ కేటాయించారు. ఆ పార్టీ నేత చాడ వెంకటరెడ్డి అభ్యర్థిగా నిలబడ్డారు. దీంతో కాంగ్రెస్ నుంచి పోటీ చేసే అవకాశం చేజారిపోయింది. తప్పని పరిస్థితుల్లో సీపీఐకి ప్రచారం చేశారు. అనంతరం 2019 ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి బీఆర్ఎస్‌లో చేరారు. కొద్ది కాలం తరువాత బీఆర్ఎస్ పార్టీకి కూడా అంటిముట్టనట్టుగా ఉన్నారు. 2022 జూలైలో ఖర్గే సమక్షంలో మళ్లీ కాంగ్రెస్‌లో చేరి అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ వస్తుందని ఆశించారు. కాగా నియోజకవర్గ పునర్విభజనలో హుస్నాబాద్ నియోజకవర్గంగా ఏర్పడిన తరువాత 2009 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రవీణ్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులు కెప్టెన్ లక్ష్మీకాంతారావుపై కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి కెప్టెన్ లక్ష్మీకాంతారావు తనయుడు బీఆర్ఎస్ అభ్యర్థి వొడితెల సతీష్‌కుమార్‌పై ఓటమి చెందారు. ములుకనూర్ సహకార బ్యాంక్ చైర్మన్‌గా ప్రవీణ్‌రెడ్డి 1987 నుంచి కొనసాగుతున్నారు. ఏదేమైనా కాంగ్రెస్‌లో మొన్న అసెంబ్లీ, నేడు ఎంపీ టికెట్ వచ్చినట్లే వచ్చి చేజారి పోవడంతో పాపం ప్రవీణ్‌రెడ్డి అంటూ నియోజకవర్గ ప్రజలు చర్చించుకుంటున్నారు.

ముగిసిన నామినేషన్ల ఘట్టం

- మెదక్‌లో చివరి రోజు 31 మంది దాఖలు
- జహీరాబాద్‌లో 19 మంది 35 సెట్లు
- నేడు నామినేషన్ల పరిశీలన
- ఈ నెల 29 వరకు ఉపసంహరణకు గడువు



నామినేషన్ దాఖలు చేస్తున్న మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి

మెదక్ అర్బన్, ఏప్రిల్ 25 : లోక్‌సభ ఎన్నిల సమరంలో కీలక ఘట్టమైన నామినేషన్ల దాఖలు గడువు ముగిసింది. మెదక్ పార్లమెంట్ స్థానానికి గురువారం చివరి రోజు పెద్దసంఖ్యలో నామినేషన్లు వచ్చాయి. బీజేపీ, బీఆర్ఎస్‌తో పాటు స్వతంత్రులు, ఇతర పార్టీల అభ్యర్థులు నామినేషన్లు వేశారు. మధ్యాహ్నం 3 గంటలకు గడువు ముగియగా గడువు లోపు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ వేసేందుకు లైన్‌లో ఉన్నవారిని అధికారులు నామినేషన్ వేసేందుకు అనుమతించారు. అభ్యర్థులు భారీ సంఖ్యలో తరలిరావడంతో కలెక్టరేట్ కార్యాలయం వద్ద కోలాహలం నెలకొన్నది. నేడు నామినేషన్ల పరిశీలన ప్రారంభం కానుంది. ఈ నెల 29న ఉపసంహరణ గడువు ముగిశాక పోటీలో మిగిలిన అభ్యర్థుల లెక్క తేలుతుంది.

54 మంది 90 సెట్లు

మెదక్ లోక్‌సభ స్థానానికి మొత్తం 54 మంది అభ్యర్థులు 90 సెట్ల నామినేషన్లు సమర్పించినట్లు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ వెల్లడించారు. ఇందులో గురువారం 31 మంది అభ్యర్థులు 36 సెట్ల నామినేషన్లు దాఖలు చేసినట్టు తెలిపారు. నామినేషన్లు వేసిన వారిలో వెంకట్రామారెడ్డి(బీఆర్ఎస్), రఘునందన్‌రావు(బీజేపీ), బోడపట్ల ఈశ్వర్(బీఎస్పీ), నందకిషోర్(ఆధార్ పార్టీ), అనిల్‌కుమార్(భారత్ జోడో పార్టీ), సిల్వర్ ఇంద్రగౌడ్(ఎస్ఎస్‌కేపీ పార్టీ), స్వతంత్ర అభ్యర్థులు మేడి శ్రీనివాస్‌రెడ్డి, ఏటి అంజనేయులు, మల్లికార్జున్, జి. అంజనేయులు, కె.భద్రేశ్, జి. ప్రదీప్‌కుమార్, రాజేందర్, ఏం.బాబు, జి.శ్రీనివాస్, వెంకటేశ్, ఎండీ అజార్, కొండి అశోక్, అభిలాష్, రాజేష్‌సాగర్, క్రాంతికుమార్, కుర్ల రఘు, కె.నర్సింహులుగౌడ్, బొమ్మల విజయ్‌కుమార్, లక్ష్మీనారాయణ, భానుచందర్ తదితరులు ఉన్నట్టు తెలియజేశారు.

జహీరాబాద్‌కు 40 మంది..

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఏప్రిల్ 25: పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈ నెల 18న మొదలైన నామినేషన్ల ఘట్టం గురువారం ముగిసింది. ఈ వారం రోజుల్లో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి 40 మంది అభ్యర్థులు 69 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. నిన్నటి వరకు 21 మంది 34 సెట్ల నామినేషన్లు వేయగా.. చివరి రోజు 19 మంది 35 సెట్ల నామినేషన్లు వేశారు. నామినేషన్లు దాఖలు చేసినవారిలో బీజేపీ నుంచి సిట్టింగ్ ఎంపీ బీబీపాటిల్, కాంగ్రెస్ నుంచి మాజీ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్, బీఆర్ఎస్ నుంచి గాలి అనీల్‌కుమార్ ఉన్నారు. అలాగే కొత్త బలిజ బస్వరాజ్ (తెలంగాణ ప్రజాశక్తి), ఎం.మోహన్‌రెడ్డి (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), రోమాల బాబు దుర్గయ్య (ఇండియా ప్రజాబంధు), చావగాని మణి (అలయన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ), దేవ శిఖామణి (ధర్మసమాజ్ పార్టీ), మున్వర్ హుస్సేన్ (రాష్ట్ర సామాన్య ప్రజాపార్టీ), బి.బాలరాజు (బీఎస్పీ), మిగిలిన వారు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు.

ఆన్‌లైన్‌లో ఏకైక నామినేషన్

నర్సాపూర్, ఏప్రిల్ 25: పార్లమెంటు ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం ఈసారి ఎన్నికల కమిషన్ కల్పించింది. దీనిని సద్వినియోగం చేసుకుని మెదక్ స్థానానికి ఓ స్వతంత్ర అభ్యర్థి ఆన్‌లైన్‌లో నామినేషన్ వేశారు. హత్నూర మండలం దౌల్తాబాద్‌కు చెందిన మారెపల్లి లక్ష్మణ్ స్వతంత్ర అభ్యర్థిగా ఆన్‌లైన్‌లో నామినేషన్ దాఖలు చేశారు. ఇందుకు సంబంధించిన పత్రాలను గురువారం ఆయన జిల్లా ఎన్నికల అధికారి రాహుల్‌రాజ్‌కు అందజేశారు. ఎన్నికల్లో ఎవరైనా నిర్భయంగా బరిలో ఉండవచ్చని తెలియజేసేందుకే తాను ఆన్‌లైన్‌లో నామినేషన్ దాఖలు చేసినట్టు పేర్కొన్నారు.



ఎండలు @ 43.1°

- భానుడి భగభగలు.. తోడైన వడగాలులు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో అత్యధిక గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు

మెదక్ అర్బన్, ఏప్రిల్ 25: ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎండలు మండుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయి. ఉదయం 8 నుంచే భానుడు భగభగలాడుతున్నాడు. మధ్యాహ్నం వేళ రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో గురువారం 43.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రెండ్రోజుల నుంచి మొదలైన వేడిగాలులు మరింత తీవ్రమయ్యాయి. దీంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఇంటి నుంచి అడుగు బయట పెట్టాలంటే భయపడుతున్నారు. మరో రెండ్రోజులు వడగాలుల ప్రభావం ఉండే అవకాశం ఉందని వాతావరణశాఖ పేర్కొన్నది.

ఉష్ణోగ్రతలు ఇలా..

సిద్దిపేట జిల్లా దూళ్మిట్టలో 43.1 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదయ్యింది. సిద్దిపేటలో 42.4 డిగ్రీలు, చిట్యాలలో 42.2డిగ్రీలు, బెజ్జంకిలో 42.0 డిగ్రీలు, లాక్డారంలో 41.7 డిగ్రీలు, తుక్కాపూర్‌లో 41.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

సంగారెడ్డి జిల్లా అన్నాసాగర్‌లో 41.8 డిగ్రీలు, కొండాపూర్‌లో 41.7 డిగ్రీలు, సదాశివపేటలో 41.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మెదక్ జిలా కొల్చారం, కొడిపల్లిలో 41.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మరింత పెరిగే అవకాశం

ఎండ తీవ్రత మే నెలలో మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణశాఖ పేర్కొంటున్నది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 43 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాబోయే రోజుల్లో మరింత పెరిగినా ఆశ్చర్యపోనవసరం లేదు. వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుల వల్లే ఉష్ణోగ్రతలు అధికమవుతున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. వీటికి తోడు వడగాల్పులు పెరగడం ఆందోళన కలిగిస్తున్నది.

ఎండ తీవ్రతకు చెలరేగిన మంటలు

కంది : సంగారెడ్డి జిల్లా కందిలో ఎండల తీవ్రతకు మంటలు చెలరేగాయి. 65వ జాతీయ రహదారి పక్కన ఉన్న ఖాళీ స్థలంలో ఏపుగా పెరిగిన గడ్డి, పిచ్చిమొక్కలకు గురువారం మధ్యాహ్నం అగ్ని అంటుకుంది. చూస్తుండగానే మంటలు వ్యాపించాయి. దట్టమైన పొగ కమ్మేయడంతో హైవేపై వాహనదారులు ఇబ్బందిపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు ఫైర్ సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఖాళీ స్థలం కావడంతో ఎలాంటి నష్టం జరగలేదు.


మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది


మెదక్ పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో అభివాదం చేస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, అభ్యర్థి వెంకట్రామారెడ్డి

మెదక్ జిల్లా గులాబీ అడ్డా

- రేవంత్‌రెడ్డికి అభివృద్ధి గురించి ఏం తెలుసు
- ఆగస్టు 15లోగా రుణమాఫీ చేసి చూపించాలి
- ఆరు గ్యారంటీలు కావాలంటే కాంగ్రెస్‌ను ఓడించండి
- మతాన్ని అడ్డుపెట్టుకొని బీజేపీ రాజకీయం
- మెదక్ రోడ్‌షోలో మాజీ మంత్రి హరీశ్‌రావు

7

తరుగు పేరిట మిల్లర్ల మోసం

- రైస్‌మిల్లుల్లో లారీకి 5 క్వింటాళ్ల కోత
- లబోదిబోమంటున్నరైతులు
- విచారణ చేపడుతాం
- జిల్లా సివిల్ సప్లయ్ అధికారి

7

సప్లిమెంటరీ ఫీజు చెల్లించాలి: ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు

వెల్దుర్తి, ఏప్రిల్ 25: ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షల ఫలితాల్లో ఫెయిలైన విద్యార్థులు మే 5వరకు సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లించడానికి అవకాశం ఉందని వెల్దుర్తి శ్రీరాయరావు సరస్వతి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక కళాశాలలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఫీజు చెల్లించాలని సూచించారు. అలాగే ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులు ఇంప్రూవ్‌మెంట్ పరీక్ష కోసం కూడా ఫీజు చెల్లించవచ్చునని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న మండల శ్రీరాములు



జగ్గారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన మండల శ్రీరాములు

చేర్యాల, ఏప్రిల్ 25: ఆప్కో మాజీ చైర్మన్ మండల శ్రీరాములు కాంగ్రెస్ తీర్థంపుచ్చుకున్నారు. బీఆర్ఎస్ అధినాయకత్వ తీరుపై అసంతృప్తితో తిరిగి హస్తం గూటికి చేరుకున్నారు. గురువారం హైదరాబాద్‌లో టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి సమక్షంలో ఆయన కాంగ్రెస్‌లో చేరారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆప్కో చైర్మన్‌గా, చేర్యాల నియోజకవర్గ ఇన్‌చార్జిగా పనిచేశారు. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంతో ఆ పార్టీలో చేరి, మరోమారు ఆప్కో చైర్మన్‌గా వ్యవహరించారు. తదనంతరం కొన్నాళ్లకు బీఆర్ఎస్‌లో చేరి, జనగామ టికెట్‌పై కన్నేసినా ఫలించలేదు. అసెంబ్లీ ఎన్నికల వేళ ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని ప్రకటించినా చివరకు విరమించుకున్నారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ బీఆర్ఎస్ టికెట్ ఇవ్వాలని కోరారు. ఈ విషయమై జనగామలో నిర్వహించిన అనుయాయుల సమావేశంలో కేసీఆర్ ఫ్లెక్సీకి సాష్టాంగ నమస్కారం చేయడంతో పాటు కొమురవెల్లి మల్లన్న ఆలయ ఆవరణలో తన ఎడమచేతి బొటనవ్రేలు కోసుకుని కేసీఆర్ ఫ్లెక్సీకి రక్తతిలకం దిద్ది ఆకర్షించే ప్రయత్నం చేశారు. అసెంబ్లీ టికెట్ల కేటాయింపులో పద్మశాలీలకు తప్పక గుర్తింపు ఇస్తే తనకు అవకాశం ఉంటుందని భావించి బీసీ సామాజికవర్గపర వ్యూహంతో పావులు కదిపినా దక్కలేదు. ఆ తర్వాత బీఆర్ఎస్ అధికారం కోల్పోవడం, రాష్ట్రవ్యాప్త సమీకరణలతో పాటు నియోజకవర్గ భవిష్యత్ ఆలోచన దృష్ట్యా మండల శ్రీరాములు కారు దిగాలని నిర్ణయించుకున్నారు. మండల శ్రీరాములు కాంగ్రెస్‌లో చేరిన విషయం నియోజకర్గ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది.

కాంగ్రెస్ గూటికి మ్యాడం బాలకృష్ణ



జగ్గారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన మ్యాడం బాలకృష్ణ

మెదక్: మెదక్ అసెంబ్లీ నియోజకవర్గ సీనియర్ నేత మ్యాడం బాలకృష్ణ సొంత గూటికి చేరుకున్నారు. గురువారం ఆయన గాంధీభవన్‌లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

మెదక్ జిల్లా గులాబీ అడ్డా

- రేవంత్‌రెడ్డికి అభివృద్ధి గురించి ఏం తెలుసు
- ఆగస్టు 15లోగా రుణమాఫీ చేసి చూపించాలి
- ఆరు గ్యారంటీలు కావాలంటే కాంగ్రెస్‌ను ఓడించండి
- మతాన్ని అడ్డుపెట్టుకొని బీజేపీ రాజకీయం
- మెదక్ రోడ్‌షోలో మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 25: మెదక్ జిల్లా బీఆర్ఎస్ అడ్డా అని, మెదక్ అభివృద్ధి గురించి సీఎం రేవంత్‌రెడ్డికి ఏం తెలుసునని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు కావాలంటే బీఆర్ఎస్ పార్టీకే ఓటు వేసి గెలిపించి, కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి గురువారం నామినేషన్లకు చివరి రోజు కావడంతో మెదక్ పట్టణంలో బీఆర్ఎస్ నిర్వహించిన రోడ్‌షోలో ఆయన పాల్గొన్నారు. స్థానిక స్టేడియం నుంచి భారీ ర్యాలీగా వచ్చి శివాజీచౌక్ వద్ద ప్రజలనుద్దేశించి మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కొత్త జిల్లాలు ఏర్పాటు చేశారు కాబట్టే ఇక్కడ నామినేషన్ వేసిన విషయాన్ని గుర్తెరగాలన్నారు.



రోడ్‌షోకు భారీగా హాజరైన జనం

రేవంత్ సర్కార్ జిల్లాలను కుదించే కుట్రపన్నుతున్నదని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు హామీల్లో ఏ ఒక్కటైనా అమలుకాలేదన్నారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి పేగులు మెడలేసుకుంటానని మాట్లాడడం తగునా అని నిలదీశారు. వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలపై ఇచ్చిన బాండ్‌పేపర్ విలువ తీసేశారని చెప్పారు. ఇప్పటి వరకు లక్ష పెండ్లిళ్లు రాష్ట్రంలో అయితే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వారికి రూ.లక్షతో తులాల బంగారం బాకీపడిందన్నారు.

కాంగ్రెస్ వచ్చాక 280 మంది రైతుల ఆత్మహత్య

తన ఎత్తు గురించి మాట్లాడేకంటే కల్లాల్లో వడ్లను కొనుగోలు చేసేలా చూడాలని హరీశ్‌రావు హితవు పలికారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 280 మంది రైతులు, 38 మంది ఆశా కార్యకర్తలు ఆత్మహత్యలు చేసుకున్నారని, ప్రభుత్వం తరఫున కనీసం వారి కుటుంబాలను పరామర్శించకపోవడం బాధాకరమన్నారు. ఢిల్లీకి వెళ్లే సమయమున్న ముఖ్యమంత్రికి బాధిత కుటుంబాలను పరామర్శించే సమయం దొరకడం లేదా ప్రశ్నించారు.

రుణమాఫీ చేస్తే రాజీనామాకు సిద్ధం

ఆగస్టు 15లోగా రైతు రుణమాఫీని అమలుచేస్తే తాను రాజీనామాకు సిద్ధమని, లేనిపక్షంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజీనామాకు సిద్ధమా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఈ విషయంలో శుక్రవారం తాను గన్‌పార్కు వద్దకు రాజీనామా లేఖతో వస్తానని.. రేవంత్‌రెడ్డి కూడా రాజీనామా లేఖతో రావాలని సవాల్ విసిరారు. అమలు నిజమైతే తన రాజీనామా లేఖను మేధావులు స్పీకర్‌కు ఇస్తారని, అమలు కాకుంటే రేవంత్‌రెడ్డి రాజీనామా లేఖను గవర్నర్‌కు అందజేయడానికి సిద్ధమా అని ప్రశ్నిచారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే కొత్త జిల్లాలు పోయి నట్లేనని విమర్శించారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో పాటు మంజీర నదిపై చెక్



రోడ్‌షోలో మాట్లాడుతున్న అభ్యర్థి వెంకట్రామారెడ్డి



మెదక్‌లోని శివాజీచౌక్ వద్ద రోడ్‌షోలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

డ్యాంల నిర్మాణం, వైద్య కళాశాలలు, రైల్వేలైన్‌కు రూ.100 కోట్లు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఒట్లు వేసినంత మాత్రాన ప్రజలు నమ్మే స్థితిలో లేరని చెప్పారు.

బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి చేసిందేమీ లేదు

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉన్నప్పటికీ రాష్ట్రానికి చేసిందేమీ లేదని హరీశ్‌రావు అన్నారు. మతాన్ని అడ్డు పెట్టుకొని రాజకీయం చేస్తున్నదని విమర్శించారు. బీఆర్ఎస్ అభ్యర్థి మెదక్ కలెక్టర్‌గా పనిచేశారని, విజ్ఞనవంతుడైన వెంకట్రామారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ప్రజాసేవకు అవకాశం ఇవ్వాలి

బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి మాట్లాడుతూ.. అధికారిగా పనిచేసిన తనకు ఇక్కడే మళ్లీ ప్రజాసేవ చేసుకోవడానికి అవకాశం ఇవ్వాలని ఓటర్లను అభ్యర్థించారు. తాను గెలిస్తే నిరుపేదలకు ఉచితంగా ఫంక్షన్‌హాళ్లు నిర్మిస్తానని, రూ.100 కోట్లతో ట్రస్ట్ నిధిని ఏర్పాటు చేసి, సేవలందిస్తానని హామీ ఇచ్చారు. అబద్ధాలు, మోసపూరిత హామీలివ్వడం తనవల్ల సాధ్యం కాదన్నారు. అభ్యర్థుల గుణగణాలను చూసి ఓటెయ్యాలని ఓటర్లను కోరారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి రోడ్‌షోకు అధ్యక్షత వహించగా జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే దేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సునితాలక్ష్మారెడ్డి, చింతా ప్రభాకర్, ఎమ్మెల్సీలు శేరిసుభాష్‌రెడ్డి, యాదవరెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ హేమలతాశేఖర్‌గౌడ్, నాయకులు దేవేందర్‌రెడ్డి, బట్టి జగపతి, ఒంటేరు ప్రతాప్‌రెడ్డి, కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, మల్లికార్జున్‌గౌడ్, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- నీటిలో మునిగి బాలుడి మృతి



నితిన్ (ఫైల్)

దౌల్తాబాద్, ఏప్రిల్ 25: సరదాగా చెరువులో ఈతకు వెళ్లిన బాలుడు ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందిన సంఘటన సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండల పరిధిలోని కొనాయిపల్లి గ్రామంలో గురువారం ఉదయం వెలుగు చూసింది. ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం పాలట గ్రామానికి చెందిన భిక్షపతి కొడుకు నితిన్(10) వేసవి సెలవులు రావడంతో సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం కొనాయిపల్లిలోని అమ్మమ్మ వాళ్ల ఇంటికి వచ్చాడు. బుధవారం ఉదయం కొనాయిపల్లిలోని మల్లారెడ్డి చెరువులోకి నితిన్ ఒక్కడే ఈతకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. బుధవారం రాత్రి వరకు నితిన్ కోసం అంతటా వెతికినా జాడ దొరకలేదు. గురువారం చెరువులో మృతదేహం తేలింది. అమ్మమ్మ కోనేరు లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

గజ్వేల్, ఏప్రిల్ 25: సిద్దిపేట జిల్లా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో గురువారం గుర్తు తెలియని మహిళా మృతదేహం లభ్యమైంది. గ్యాస్ గోడౌన్‌కు వేళ్లే దారిలోని ఓ ముళ్ల చెట్టు వద్ద కుళ్లిన స్థితిలో మృతదేహం లభించింది. దుర్వాసన వస్తుండడంతో చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. గజ్వేల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. నాలుగు రోజుల క్రితం మృతిచెంది ఉంటుందని, వయస్సు సుమారు 35 నుంచి 40 మధ్య ఉంటుందని పోలీసులు తెలిపారు. ముఖం పూర్తిగా కుళ్లి పోవడంతో గుర్తుపట్టడానికి వీలు లేకుండా పోయిందని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ జిల్లా ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదా తెలిపారు.

ఎంపీ బీబీ పాటిల్ వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు



తీవ్రగాయాలతో యాదగిరి

చేగుంట, ఏప్రిల్ 25: జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్ వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మెదక్ జిల్లా నార్సింగి మండలం జప్తి శివనూర్ 44వ జాతీయ రహదారి సంకాపూర్ వద్ద గురువారం జరిగింది. ఎంపీ బీబీ పాటిల్ తన కారులో హైదరాబాద్ నుంచి కామారెడ్డి వెళ్తుండగా.. రామాయంపేట నుంచి సంకాపూర్ వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో ఆ గ్రామానికి చెందిన బోయిని యాదగిరికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్ వాహనంలో రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నార్సింగి ఎస్ఐ అమ్మద్ మోహినుద్దీన్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

సదాశివపేట, ఏప్రిల్ 25: విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన సంఘటన సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలంలోని నాగులపల్లిలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగులపల్లి గ్రామానిక చెందిన గొల్ల అశోక్ గురవారం ఉదయం తన పొలంలో సాగుచేస్తున్న జొన్న పంటకు నీళ్లందించేందుకుగాను పొలానికి వెళ్లాడు. బోరుమోటారు ఆన్ చేయగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై పడిపోయాడు. గమనించిన స్థానికులు సదాశివపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందదాని వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వివరించారు.

రెండు బైకులు ఢీ కొని ఒకరి మృతి

కౌడిపల్లి, ఏప్రిల్ 25: రెండు బైకులు ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన మెదక్ జిల్లా కౌడిపల్లి మండల పరిధిలోని కూకుట్లపల్లిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గురువారం సాయంత్రం మండల పరిధిలోని కూకుట్లపల్లికి చెందిన మంగళి రమేష్(29) తన బైక్‌పై కౌడిపల్లికి బయలుదేరాడు. అదే సమయంలో కౌడిపల్లికి చెందిన మరో యువకుడు తన బైక్‌పై కొల్చారం మండలంలోని దుంపలకుంటకు వెళ్తుండగా.. కూకట్లపల్లి గ్రామ శివారులోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో రెండు వాహనాలు ఎదురుఎదురుగా బలంగా ఢీకొన్నాయి. రమేష్‌కు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

కారును ఢీకొని యువకుడు..



బైక్, కారు ఢీకొన్న దృశ్యం

తూప్రాన్: మెదక్ జిల్లా తూప్రాన్ మండలం యావాపూర్ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం ఎల్కంటి గ్రామానికి చెందిన ఎండీ ఖాజా(30) గజ్వేల్‌లో వాటర్‌ప్యూరిఫై మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి తన ద్విచక్ర వాహనంపై తూప్రాన్ వైపు నుంచి గజ్వేల్ వైపు వెళ్తున్నాడు. యావాపూర్ చౌరస్తా వద్ద ఎదురుగా వస్తున్న కారును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఖాజా అక్కడికక్కడే మృతి చెందాడు. తూప్రాన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మార్చురీకి తరలించారు.

హత్య కేసులో నిందితులకు రిమాండ్

కల్హేర్/సిర్గాపూర్, ఏప్రిల్ 25: సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండల పరిధిలోని సింగార్ బొగడ తండాకు చెందిన జాదవ్ శీనునాయక్ హత్య కేసులో 12మంది నిందితులకు గురువారం జిల్లా కోర్టు న్యాయాధికారి 14 రోజుల రిమాండ్ విధించినట్లు కంగ్టి సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, సిర్గాపూర్ ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు. సీసీరోడ్డుకు ఉపయోగించిన కంకర తరలింపు విషయంలో ఈ నెల 19న ఇరు వర్గాలకు చెందిన రెండు కుటుంబాల వారికి ఘర్షణ జరిగింది. ప్రత్యర్థి వర్గంవారు కర్రలు, రాళ్లతో దాడి చేయడంతో జాదవ్ శీనునాయక్ మరణించిన విషయం విధితమే. ఈ కేసులో సింగార్ బొగడతండాకు చెందిన రాజు నాయక్‌తో పాటు మరో 11 మందిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఎన్నికల ఫిర్యాదులకు ప్రత్యేక ఆఫీసులు

- సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 25: ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులు, సలహాలు, సూచనల చేసేందుకు సంగారెడ్డి కలెక్టరేట్‌లో ప్రత్యేక కార్యాలయాలు ఏర్పాటు చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం నియమించిన సాధారణ ఎన్నికల పరిశీలకులు గోపాల్, వ్యయ జి.తివారి, వ్యయ పరిశీలకులు మోతిలాల్ ఎస్‌శెట్ కలెక్టరేట్‌లో అందుబాటులో ఉంటారన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలు అతిక్రమించే వారిపై వివిధ రాజకీయ నాయకులు, ప్రజలు వీరిని నేరుగా కలిసేందకు వీలుగా ప్రత్యేక కార్యాలయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదులు స్వీకిరంచేందుకు అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కుని వినియోగించుకునేందుకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నామని ఆమె వెల్లడించారు. ఎన్నికలకు సంబంధించిన వ్యయ ఖర్చులు, డబ్బులు, మద్యం పంపిణీ, తదితర అంశాలపై ఫిర్యాదులు స్వీకరిస్తారని వ్యయ పరిశీలకులు మోతిలాల్ ఎస్‌శెట్ తెలిపారు. సాధారణ ఎన్నికల పరిశీలకులు గోపాల్ జి.తివారి 7995692890, వ్యయ పరిశీలకుడు మోతిలాల్‌ఎస్‌శెట్ 7995692887 ఫోన్ నంబర్లను సంప్రదించి ఫిర్యాదు చేయవచ్చని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు.

పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలి

- కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు అమిత్ కటారియా

కరీంనగర్, ఏప్రిల్ 25: పార్లమెంట్ ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ సాధారణ ఎన్నికల పరిశీలకుడు, ఐఏఎస్ అధికారి అమిత్ కటారియా ఆదేశించారు. గురువారం ఆయన కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలు, ఇతర జిల్లా అధికారులతో ఎన్నికల నియమావళిపై సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం అమిత్ కటారియా మాట్లాడుతూ... పార్లమెంట్ ఎన్నికలు పూర్తయ్యే వరకు అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియాలో పోస్టులపై ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు. పార్లమెంట్ నియోజకవర్గ పోలీస్‌శాఖ పరిశీలకుడు మనీష్ చౌదరి మాట్లాడుతూ.. ఎక్కడ ఏ ఫిర్యాదు వచ్చినా వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టాలని, నగదు తరలింపుతోపాటు ఓటర్లను ప్రలోభపెట్టే వస్తువులపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించారు. సమావేశంలో హుస్నాబాద్ ఏసీపీలు తిరుమల్, సతీష్, ఆర్డీవోలు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికకు మోగిన నగారా

చేర్యాల, ఏప్రిల్ 25: నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికకు నగారా మోగింది. మే 27న పోలింగ్ జరపనున్నట్లు ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసింది. మే 2న నోటిఫికేషన్ విడుదల, 9వరకు నామినేషన్ దాఖలు, 10న నామినేషన్ల పరిశీలన, 13న ఉపసంహరణ, 27న పోలింగ్, జూన్ 5న లెక్కింపు చేపట్టనున్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా 2021మార్చిలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఆయన పదవీకాలం మార్చి-2027 వరకు ఉండగా అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ ఎమ్మెల్యేగా గెలుపొందారు. దీంతో ఆయన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో ఖాళీ ఏర్పడింది. జనగామ నియోజకవర్గం భువనగిరి పార్లమెంటుస్థానంతో పాటు నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలోనూ ఉన్నది.

తరుగు పేరిట మోసం

- రైస్‌మిల్లులో లారీకి 5 క్వింటాళ్ల కోత
- లబోదిబోమంటున్న రైతులు
- విచారణ చేపడుతాం: జిల్లా సివిల్ సప్లయ్ అధికారి హరీష్



సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లి సమీపంలోని వెంకటరమణ రైస్‌మిల్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 25: ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువెళ్తే సెంటర్ల నిర్వాహకులు, రైస్ మిల్లర్ల యజమానులు కుమ్మక్కై నిండా ముంచుతున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేసిన సంఘటన గురువారం సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లి సమీపంలోని వెంకటరమణ రైస్‌మిల్ వద్ద చోటు చేసుకుంది. రైస్‌మిల్లులోకి వచ్చిన రెండు ధాన్యం లారీల నుంచి తరుగు పేరిట లారీకి ఐదు క్వింటాళ్ల చొప్పున కోత విధించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు. ఈ విషయమై ఏ అధికారిని అడిగినా పట్టించుకోవడంలేదని రైతులు వాపోయారు. ఐకేపీ, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటికే తరుగు పేరిట కోత విధించారని, ఇప్పుడు మిల్లుల వద్ద కూడా మిల్లర్స్ తరుగు పేరిట కోత విధించడం అన్యాయమని రైతులు వాపోయారు. ఈ విషయంపై రైతులు ఐకేపీ నిర్వాహకులను ప్రశ్నిస్తే తమకేమీ సంబంధంలేదని, రైస్‌మిల్లుల నిర్వాహకులను అడగాలంటూ నిర్లక్ష్యపు సమాధానమిచ్చారని తెలిపారు. రైస్‌మిల్లర్లను అడిగితే ఐకేపీ వారిని అడగాలంటూ దాటవేస్తున్నారని చెప్పారు. దీంతో ఏమి చేయాలో తెలియక అయోమయ పరిస్థితి నెలకొందని రైతులు అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తరుగు లేకుండా రైతులకు న్యాయం జరిగేలా చూడాలని వారు కోరారు. ఈ విషయమై జిల్లా సివిల్ సప్లై అధికారి హరీష్‌ను వివరణ కోరగా విచారణ చేపడతామని, రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు.

వాహన తనిఖీల్లో రూ.68 వేల నగదు సీజ్

తొగుట, ఏప్రిల్ 25: సిద్దిపేట జిల్లా తొగుట మండలం తుక్కాపూర్ గ్రామ శివారులో గురువారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.68 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. తొగుట సీఐ లతీఫ్ తెలిపిన కథనం ప్రకారం... బండారుపల్లి గ్రామానికి చెందిన సాయిబాబా అనే వ్యక్తి తన ద్విచక్రవాహనంలో నగదును తీసుకొని తొగుటకు వెళ్తుండగా.. తొగుట ఎస్ఐ లింగం ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. రూ.68 వేలకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఎన్నికల నిబంధనల ప్రకారం సీజ్ చేసి గ్రీవెన్స్ కమిటీకి అప్పగించినట్లు తెలిపారు. ఆ నగదుకు సంబంధించి సదరు వ్యక్తులు ఆధారాలు చూపించి తీసుకెళ్లవచ్చునని పోలీసులు తెలిపారు.



నర్సాపూర్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు కారును తనిఖీ చేస్తున్న పోలీసు సిబ్బంది

మాజీ మంత్రి హరీశ్‌రావు కారు తనిఖీ

నర్సాపూర్, ఏప్రిల్ 25: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు కారును హైదరాబాద్-మెదక్ జాతీయ రహదారిపై గురువారం నర్సాపూర్ సమీపంలో పోలీసులు తనిఖీ చేశారు. గురువారం హైదరాబాద్ నుంచి మెదక్‌కు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి నామినేషన్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళ్తున్న క్రమంలో నర్సాపూర్ సమీపంలోని మల్లన్నగుడి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద కారును ఆపి తనిఖీ చేశారు. హరీశ్‌రావు కూడా పోలీసులకు సహకరించి, తనిఖీ చేసే వరకు కారుదిగి నిరీక్షించారు.

పచ్చ చీర కట్టుకుని.. వైఎస్ శత్రువు ఇంటికి వెళ్లారు

- బురద చల్లేందుకు ఇద్దరు చెల్లెళ్లను
- ఎవరు పంపించారో మీకు తెలుసు
- వీళ్లా వైఎస్ఆర్ వారసులు?: జగన్
- షర్మిల, సునీతపై పరోక్ష విమర్శలు
- వైఎస్ అవినాశ్ చిన్నపిల్లాడని వ్యాఖ్య

కడప, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): "వైఎస్ ఎవరితో పోరాడారో, అలాంటి శత్రువుల ఇంటికి పసుపు చీర కట్టుకుని వెళ్లారు. వారి స్క్రిప్టులను మక్కీకి మక్కీ చదివి వినిపిస్తూ, వారి కుట్రలో భాగమవుతున్నారు. వీళ్లా వైఎస్సార్ వారసులు.? వైఎస్ విగ్రహాలు గ్రామంలో ఉండకూడదని చెప్పిన వారితో చెట్టాపట్టాలేసుకున్నారు" అని ఏపీ సీఎం జగన్ తన చెల్లెళ్లు షర్మిల, సునీతను పరోక్షంగా విమర్శించారు. నామినేషన్ వేసేందుకు గురువారం తాడేపల్లి నుంచి పులివెందులకు చేరుకున్న ఆయన.. అక్కడ బహిరంగ సభలో మాట్లాడారు. "జగన్ అధికారంలోకి వచ్చాక మమ్మల్ని పక్కనబెట్టాడని మాట్లాడుతున్న నా బంధువులకు తెలియజేస్తున్నా"నంటూ షర్మిల, సునీత పేర్లను ప్రస్తావించకుండా నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. షర్మిల తన కుమారుడి పెళ్లి శుభలేఖ ఇవ్వడానికి చంద్రబాబు ఇంటికి వెళ్లిన సందర్భాన్ని ప్రజలకు గుర్తుచేశారు. 'అవినాశ్ ఏ తప్పూ చేయలేదని బలంగా నమ్మాను కాబట్టే అతడికి టికెట్ ఇచ్చాను. మా అందరి కన్నా చిన్నపిల్లాడు అవినాశ్. ఆ పిల్లాడి జీవితం నాశనం చేయాలని పెద్దపెద్దవాళ్లంతా కుట్రలు చేస్తున్నారు. వివేకా హత్య కేసు విషయంలో అవినాశ్ అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పలేని వీరంతా ఈ చిన్నపిల్లాడిని దూషించడం, తెరమరుగు చేయాలనుకోవడం దారుణం. అసలు వీరందరూ మనుషులేనా?" అన్నారు. "బురద చల్లేందుకు ఇద్దరు చెల్లెమ్మలను ఎవరు పంపించారో, వారి వెనకాల ఎవరున్నారో మీకు తెలుసు" అని ప్రజలనుద్దేశించి అన్నారు.

సభ్యత, సంస్కారం ఉన్నాయా?

- నేను కట్టుకున్న చీర గురించి మగవాళ్ల ముందు మాట్లాడతావా?
- జగన్‌పై షర్మిలారెడ్డి ఫైర్



గుంటూరు/విజయవాడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): 'సీఎం స్థాయిలో ఉన్న జగన్మోహన్‌రెడ్డి బహిరంగ సభ పెట్టి.. వేల మంది మగవాళ్లు ఉంటే.. నేను కట్టుకున్న చీర గురించి మాట్లాడాడు' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ధ్వజమెత్తారు. మాట్లాడుతున్నది సొంత చెల్లెలి గురించి అన్న ఇంగితం కూడా లేకుండా తన వంటిపై ఉన్న బట్టల గురించి ప్రస్తావించారంటే ఎంత దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారో ఆలోచించాలని రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం గుంటూరు, విజయవాడల్లో జరిగిన ప్రచార సభల్లో ఆమె ప్రసంగించారు. పులివెందులలో తనపై జగన్ చేసిన వ్యాఖ్యలకు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. 'నేను పసుపు చీర కట్టుకొన్నానని అవహేళనగా మాట్లాడారు. ఏం.. పసుపు చీర కట్టుకోకూడదా? చంద్రబాబు ఏమైనా పసుపు రంగు కొన్నారా? జగన్ ఒక విషయాన్ని మరిచిపోయినట్లున్నారు. జగన్ పత్రికలో పసుపు రంగు ఉంటుంది. దానికి వైఎస్ ఆనాడు చెప్పిన మాట.. పసుపు అంటే మంగళకరమైన రంగు. అది టీడీపీది కాదని పెట్టించారు' అని తెలిపారు. సొంత చెల్లి చీర గురించి మాట్లాడుతున్న వీరికి సభ్యత, సంస్కారం ఉన్నాయా అని విరుచుకుపడ్డారు. ఇంకా ఆమె ఏమన్నారంటే..

దేవుడు మీకు ఇంగితం ఇవ్వలేదా?

సీఎం జగన్ ఈ రోజున పులివెందుల సభలో వివేకానందరెడ్డి ప్రస్తావన చేశారు. ఆయన గురించి ఒక్క మంచి మాట కూడా నోటి వెంట రాలేదు. వివేకానందరెడ్డికి రెండో పెళ్లి అయిందట. ఇంకో సంతానం ఉందట! అంతేతప్ప.. వివేకానందరెడ్డి ఒక ప్రజానాయకుడని గానీ.. ఎవరైనా సమస్యతో వస్తే ఉత్త చేతులతో పంపడని గానీ.. రాజశేఖర్‌రెడ్డి తమ్ముడని గానీ... ఆఖరి నిమిషం వరకు వైసీపీ కోసమే పని చేశారని గానీ ఒక్క మాటయినా జగన్ నోట్లో నుంచి రాలేదంటే ఎంత ఆశ్చర్యం! అవినాశ్‌రెడ్డి అమాయకుడు, చిన్నవాడంట! ఆయన భవిష్యత్‌ను మేం నాశనం చేస్తున్నామని జగన్ మాట్లాడుతున్నారు. అతడి భవిష్యత్‌ను పాడు చేసేవాళ్లమే అయితే మీరు ఎంపీగా నిలబెట్టినప్పుడు.. వివేకా వద్దు వద్దని చెప్పినా మేమెవరం కాదనలేదే! వివేకాను చంపిన రోజునే అవినాశ్ చంపాడని చెప్పలేదే! అవినాశ్ మంచివాడని నమ్ముతున్నాను.. అందుకే ఎంపీ టికెట్ ఇచ్చానని జగన్ అంటున్నారు. ఎందుకు గుడ్డిగా నమ్ముతున్నారు? మీకు దేవుడు ఇంగితం ఇవ్వలేదా? మీకు ఆలోచించే శక్తి లేదా? సీబీఐ అన్ని ఆధారాలు చూపిస్తోంది కదా! చంపించిన వారు, చంపినవారి గూగుల్ టేక్ అవుట్స్ మ్యాచ్ అవుతున్నాయి. లావాదేవీలు జరిగాయి. అడ్వాన్స్‌లు తీసుకున్నారని సీబీఐ చెబుతున్నా ఎందుకు అవినాశ్‌ను ఇంకా నమ్ముతున్నారు? అన్నీ తెలిసి కూడా కాపాడుతున్నారంటే మీకు ఏమి అవసరం ఉందో చెప్పాలి. అవినాశ్‌ను నిందితుడిగా సీబీఐ చేర్చినా ఎందుకు కాపాడారు.. మళ్లీ ఎందుకు టికెట్ ఇచ్చారో చెప్పాలి.

వివేకా హత్యపై లైవ్ డిబేట్‌కు సిద్ధం

- మీ చానల్‌కే వస్తా.. మీరు సిద్ధమా?
- సీఎం జగన్‌కు డాక్టర్ సునీత సవాల్
- గాయానికి బ్యాండ్ తీయాలని సలహా
- లేకుంటే చీము పడుతుందని హెచ్చరిక

పులివెందుల రూరల్, ఏప్రిల్ 25: "వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడు అవినాశ్‌రెడ్డి నిర్దోషి అని మీరు అంటున్నారు. ఇక ఏ వ్యవస్థపై మీకు నమ్మకముంది సార్?" అని ఏపీ సీఎం జగన్‌ను ఆయన చెల్లెలు, వివేకా కుమార్తె డాక్టరు సునీత సూటిగా ప్రశ్నించారు. పులివెందుల సభలో అవినాశ్‌రెడ్డిని జగన్ చిన్నపిల్లాడుగా సంబోధించడంపై సునీత స్పందించారు. చిన్నపిల్లాడైతే స్కూలుకు పంపించాలన్నారు. పులివెందులలో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. "ఎంపీ అంటే బాధ్యత.. పిల్లలకు టికెట్టు ఇవ్వరు. నిందితులను మూడోసారి ఎంపీగా పోటీ చేయిస్తున్నారు. సీబీఐ నిందితులుగా తేల్చిన వారిని మీరు ప్రోత్సహిస్తున్నారు. దయచేసి ఇలా చేయకండి" అని కోరారు. "మీకోసం వివేకా ఎన్నో త్యాగాలు చేశారు. కానీ మీరేం చేశారు? ఆయన గురించి మంచిగా ఒక్కమాట కూడా మాట్లాడరు. ఆయన హత్యపై మీ చానల్‌లో లైవ్ డిబేట్ ఏర్పాటు చేయండి. నేను సిద్ధం. మీరు సిద్ధమా..?" అని జగన్‌కు సవాల్ విసిరారు. అలాగే.. గులకరాయి ఘటన జరిగినప్పటి నుంచీ తలకు బ్యాండేజ్ వేసుకుని తిరుగుతున్న జగన్‌కు ఆమె డాక్టర్‌గా ఓ సలహా ఇచ్చారు. దెబ్బతగిలిన చోట బ్యాండ్ ఎయిడ్ పెట్టుకుంటే లోపల చీము పట్టి, సెప్టిక్ అయ్యే చాన్స్ ఉందని హెచ్చరించారు. బ్యాండ్ ఎయిడ్ తీసేస్తే గాయం త్వరగా మానిపోతుందని తెలిపారు.

జగన్.. నీకిది తగునా?

- నీ సొంత మీడియాలోనే మీ చిన్నాన్న వ్యక్తిత్వ హననమా?
- సీఎం జగన్‌కు వివేకా సతీమణి సౌభాగ్యమ్మ లేఖ



పులివెందుల, ఏప్రిల్ 25: "నిన్ను సీఎంగా చూడాలని తపించిన మీ చిన్నాన్న వ్యక్తిత్వాన్ని మీ పత్రికల్లో, టీవీల్లో, సోషల్ మీడియాలో హననం చేయడం తగునా? న్యాయం కోసం పోరాడుతున్న నీ చెల్లి సునీత.. ఆమెకు మద్దతు ఇస్తున్న షర్మిలపై నిందలు మోపుతుంటే.. కుటుంబ సభ్యునిగా కాకపోయినా.. ముఖ్యమంత్రిగా అయినా ఇదేనా నీ కర్తవ్యం?" అని సీఎం జగన్‌ను వివేకా భార్య వైఎస్ సౌభాగ్యమ్మ ప్రశ్నించారు. ఈ మేరకు ఆమె సీఎంకు రాసిన బహిరంగ లేఖను గురువారం సోషల్ మీడియాలో పోస్టు చేశారు. "2009లో తండ్రి చనిపోయినపుడు నువ్వు ఎంత వేదనను అనుభవించావో 2019లో నీ చెల్లి సునీత కూడా అంతే వేదన అనుభవించింది. అప్పటినుంచి జరిగిన పరిణామాల్లో మమ్మల్ని ఎక్కువ బాధించిన విషయం.. మన కుటుంబంలోని వారే ఈ హత్యకు కారకులు కావడం... వాళ్లకు నువ్వు రక్షణగా ఉండటం. నిన్ను సీఎంగా చూడాలని తపించిన చిన్నాన్నపై మీ సొంత మీడియా, పార్టీ వర్గాలు తీవ్ర విమర్శలు చేశాయి. మాటల్లో చెప్పలేనంత విధంగా వ్యక్తిత్వ హననం చేయడం, చేయించడం నీకు తగునా? న్యాయం కోసం పోరాటం చేస్తున్న నీ చెల్లెలు సునీతను హేళన చేస్తూ, నిందలు మోపుతూ, దాడులకు కూడా తెగబడే స్థాయికి కొంత మంది దిగజారుతుంటే నీకు ఏమాత్రం పట్టడం లేదా? సునీతకు మద్దతుగా నిలిచి పోరాడుతున్న షర్మిలను కూడా టార్గెట్ చేస్తుంటే నువ్వు నిమ్మకు నీరెత్తినట్లు ఉండటం ఏమిటి? కుటుంబ సభ్యునిగా కాకపోయినా రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఇదేనా నీ కర్తవ్యం? ఇంకా బాధించే విషయం.. హత్యకు కారకులైన వారికి మళ్లీ పోటీ చేసే అవకాశాన్ని నువ్వు కల్పించడం. ఇది సముచితమా? ఇటువంటి చర్యలు నీకు ఏమాత్రం మంచిది కాదు. హత్యకు కారకుడైన నిందితుడు నామినేషన్ దాఖలు చేశాడు. చివరి ప్రయత్నంగా న్యాయం, ధర్మం గురించి ఆలోచించమని నిన్ను అర్థిస్తున్నా. రాగద్వేషాలకు అతీతంగా పరిపాలన చేస్తానని ప్రమాణం చేసిన ముఖ్యమంత్రిగా న్యాయం, ధర్మం, నిజంవైపు నిలబడమని వేడుకుంటున్నా" అని సౌభాగ్యమ్మ తన లేఖలో పేర్కొన్నారు.

మెరుగైన వైద్యసేవలను అందించాలి

● డీఎంఅండ్‌హెచ్‌వో పుట్ల శ్రీనివాస్



సిబ్బందితో మాట్లాడుతున్న పుట్ల శ్రీనివాస్

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 25: దవాఖానకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యసేవలను అందించాలని సిద్దిపేట జిల్లా డీఎం అండ్‌హెచ్‌వో పుట్ల శ్రీనివాస్ ఆదేశించారు. పట్టణంలోని మోహిన్‌పురాలో ఉన్న బస్తీ దవాఖానాను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ల్యాబ్‌లో నిర్వహిస్తున్న పరీక్షలకు సంబంధించిన రికార్డులను పరిశీలించి, దవాఖాన ద్వారా ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, దవాఖాన పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. సమయపాలన పాటించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, శ్రీకాంత్, వైద్య అధికారులు, స్టాఫ్ నర్సులు తదితరులు పాల్గొన్నారు.

సలహా మండలి ఎంపిక

హుస్నాబాద్ టౌన్, ఏప్రిల్ 25: జనజాగృతి కళా సంస్థలో అంతర్భాగమైన కవి సాయంత్రం గ్రూపు సలహా మండలి సభ్యులను ఎంపిక చేసుకున్నట్లు సంస్థ అధ్యక్షుడు ముక్కెర సంపత్‌కుమార్ తెలిపారు. సలహా మండలి సభ్యులుగా పెద్దపల్లి అదనపు కలెక్టర్ జీవీశ్యాంప్రసాద్ లాల్, సినీ గేయ రచయిత మౌనశ్రీ మల్లిక్, సీనియర్ అడ్వకేట్ గులాబీల మల్లారెడ్డి, జైళ్లశాఖ డీఎస్పీ దార్ల కాళిదాస్, జర్నలిస్టు బోయిని భాస్కర్, రాములను నియమించినట్లు చెప్పారు.

అంగరంగ వైభవంగా రథోత్సవం

● వేలాదిగా తరలివచ్చిన భక్తులు



బెజ్జంకిలో నృసింహస్వామి రథోత్సవ వేడుకల్లో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



చేర్యాల: బండపల్లి కాలనీలో ఊరేగింపుగా జలాలను తీసుకువస్తున్న మహిళలు

బెజ్జంకి, ఏప్రిల్ 25: మండల కేంద్రంలోని ఏకశిల గుట్టపై వెలసిన శ్రీ లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవ వేడుకలు గురువారం అంగరంగ వైభవంగా జరిగాయి. రథోత్సవ వేడుకలకు వేలాది మంది భక్తులు తరలివచ్చి నమో నృసింహ నామస్మరణతో రథాన్ని లాగుతూ, దివిటీలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. పూల తోరథాన్ని సుందరంగా అలకరించి శ్రీలక్ష్మీ సమేత నృసింహస్వామి ఉత్సవమూర్తులను ఆలయ అర్చకులు రథంలో నెలకొల్పి భక్తజన మధ్య రథాన్ని గుట్టచుట్టూ తిప్పుతూ రథోత్సవం నిర్వహించారు. గుట్టపైన ఉన్న ఏకశిల స్థంభానికి భక్తులు ఒడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. మండలంలోని ఆయా గ్రామాల ప్రజలతో పాటు, జిల్లా నలుమూలల నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. జాతరలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రాజరాజేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

చేర్యాల, ఏప్రిల్ 25: చేర్యాల మండలంలోని ఆకునూరు గ్రామంలోని రాజరాజేశ్వరస్వామి ఆలయంలో దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ కొనసాగుతున్నది. అందులో భాగంగా రెండోరోజైన గురువారం విశేష పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రోక్తంగా స్థాపితదేవతాపూజలు, మూలమంత్ర అనుష్ఠానములు, హోమాలు, దేవతామూర్తుల విగ్రహాలకు శయ్యాధి, ధాన్యాధివాసం, ఫల, పుష్పాధి వాసం పూజలు నిర్వహించారు. వేడుకలలో గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా ధాన్యాధి, శయ్యాధివాహం

చేర్యాల పట్టణ శివారు బండపల్లి కాలనీలో కొనసాగుతున్న దుర్గమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలలో భాగంగా రెండోరోజైన గురువారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా మంటపారాధన, యంత్ర ప్రతిష్ఠ, రుద్ర-దుర్గా సహిత ఆరాహిత దేవతామూలమంత్ర హవనం జరిపారు. ప్రతిష్ఠిత దేవతామూర్తుల విగ్రహాలకు సంప్రదాయబద్ధంగా పుష్పాధివాసం, శయ్యాధివాసం, ధాన్యాధివాసం ఘనంగా నిర్వహించారు. కాలనీవాసులు ఇంటిల్లిపాదిగా తరలివచ్చారు. మహిళలు భక్తిప్రపత్తులతో తమ ఇళ్లలో నుంచి జలాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చి దేవతామూర్తులను అభిషేకించారు.

నేడే మహంకాళీ ఆలయ విగ్రహప్రతిష్ఠ

మిరుదొడ్డి,ఏప్రిల్ 25: మండలంలోని ధర్మారం గ్రామంలో నూతనంగా నిర్మించిన మహంకాళీ ఆలయ విగ్రహప్రతిష్ఠకు ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 26 నుంచి 29వరకు విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు కొనసాగుతాయని తెలిపారు.

లద్నూరులో చండీహోమం

మద్దూరు, ఏప్రిల్ 25: మండలంలోని లద్నూరులో నిర్వహిస్తున్న బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా రెండో రోజు చండీ యాగాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 56 రకాల ద్రవ్యాలతో హోమాన్ని నిర్వహించారు. బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు విజయవంతంగా జరగాలని కోరుతూ హోమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి



నర్సింహులు (ఫైల్)

సిద్దిపేటరూరల్, ఏప్రిల్ 25: చేపలుపట్టేందుకు వెళ్లిన వ్యక్తి చెరువులో పడి మృతిచెందాడు. ఈ సంఘటన సిద్దిపేట రూరల్ మండలంలోని చింతమడకలో గురువారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘం సభ్యులు గ్రామంలోని పెద్ద చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లారు. లోతు గమనించకుండా లోపలికి వెళ్లి చేపలు పడుతుండగా నీట మునిగిన మోతుకు నర్సింహులు (38) అక్కడికక్కడే మృతి చెందినట్లు తోటి సభ్యులు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. అతని మృతిపట్ల అనుమానాలు ఉన్నాయని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిద్దిపేట రూరల్ ఎస్‌ఐ అపూర్వరెడ్డి తెలిపారు.

తాగునీటికి ఇబ్బందులు తలెత్తకూడదు

● డీపీవో దేవకీదేవి



నర్సరీని పరిశీలిస్తున్న డీపీవో దేవకీదేవి

చిన్నకోడూరు, ఏప్రిల్ 25: వేసవి దృష్ట్యా గ్రామంలో ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని డీపీవో దేవకీదేవి అన్నారు. గురువారం మండలంలోని ఇబ్రహీంనగర్ గ్రామాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ నర్సరీని, డంపింగ్ యార్డ్‌ను, గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించి మాట్లాడారు. నర్సరీలోని మొక్కలను ఎండిపోకుండా సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జనార్దన్, పంచాయతీ కార్యదర్శి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ నిలిపివేత

సిద్దిపేటరూరల్, ఏప్రిల్ 25: పట్టణంలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 7గంటల నుంచి 8:30గంటల వరకు పట్టణంలోని ఎల్లమ్మ గుడి పరిసర ప్రాంతంతో పాటు ఇందిరమ్మ కాలనీ, లింగారెడ్డిపల్లి గ్రామంలో విద్యుత్ సరాఫరా నిలిపివేస్తున్నట్టు వెల్లడించారు. మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వెంకట్రామారెడ్డి నామినేషన్‌కు తరలిన బీఆర్‌ఎస్ నాయకులు

గజ్వేల్, ఏప్రిల్ 25: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి భారీగా బీఆర్‌ఎస్ నాయకులు మెదక్‌లో ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి నామినేషన్ ర్యాలీకి తరలివెళ్లారు. ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీతో పాటు నియోజకవర్గంలోని ఆయా మండలాల నుంచి బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, తాజా మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

అమిత్‌షా సభకు తరలిన బీజేపీ నాయకులు

దుబ్బాక/మిరుదొడ్డి/గజ్వేల్ ఏప్రిల్25: సిద్దిపేటలో నిర్వహించే బీజేపీ సభకు దుబ్బాక, మిరుదొడ్డి మండలాల నుంచి బీజేపీ నాయకులు భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో బీజేపీ దుబ్బాక, మిరుదొడ్డి మండలాల అధ్యక్షులు శివప్రసాద్, దేవరాజు, బీజేపీ సీనియర్ నాయకులు తదితరులు ఉన్నారు.సిద్దిపేటకు తరలిన బీజేపీ నాయకులు. బీజేపీ నాయకులు సిద్దిపేట పట్టణంలోని డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన విజయ సంకల్ప సభకు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పట్టణాధ్యక్షుడు మనోహర్‌యాదవ్, మండల అధ్యక్షుడు అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమిత్‌షా సభతో మెదక్ గడ్డపై కాషాయజెండాను ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. వారితో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ



ప్యాడీ క్లీనర్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో

మద్దూరు, ఏప్రిల్ 25: మండలంలోని నర్సాయపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం డీఆర్‌డీవో జయదేవ్ ఆర్యా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్యాడీ క్లీనర్‌తో పాటు తేమను ఏ విధంగా తనిఖీ చేస్తున్నారో పరిశీలించారు. తూకం వేస్తున్న కాంటాలో తేడాలేమైన్నా ఉన్నాయా అని పరిశీలించారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనుల్ని పరిశీలించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం పనులకు తొందరగా వచ్చే విధంగా చూసి, రూ.250 కూలీ పడే విధంగా చూడాలని ఫీల్డు అసిస్టెంట్‌కు సూచించారు. అనంతరం నర్సరీని పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాంమోహన్, ఎంపీవో ఖాజామొయినుద్దీన్, ఏపీఎం బాబూరావ్, టీఏలు, పంచాయతీ సెక్రటరీ, ఫీల్డు అసిస్టెంట్‌తో పాటు మహిళా సంఘాల అధ్యక్షులు, రైతులు పాల్గొన్నారు.

ఉత్తమ పద్ధతుల్లో విత్తనాలు నాటుకోవాలి

● రైతులకు నూజివీడు సీడ్స్ కంపెనీ అవగాహన

దౌల్తాబాద్, ఏప్రిల్ 25: రైతులు వర్షకాలంలో అధిక సాంద్రత పద్ధతి మెళకువలు పాటించి విత్తనాలను వేసుకోవాలని నూజివీడు సీడ్స్ కంపెనీ రిజనల్ మేనేజర్ శ్రీకాంత్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో రైతు వేదికలో నూజివీడు కంపెనీ ఆధ్వర్యంలో ఆయాగ్రామాలకు చెందిన ఉత్తమ రైతులకు వర్షకాలం సాగుకు ఉత్తమ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కంపెనీ మేనేజర్ మాటట్లాడుతూ- వర్షకాలంలో రైతులు సాగుకు అనువైన వంగడాలు వరి, పత్తి, మక్కజొన్న, పంటలను విత్తుకోవాలన్నారు. రైతులు యాజమాన్య పద్ధతులతో విత్తనాలు నాటుకోవడంతో ఖర్చులు తగ్గి ఆదాయం పెంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు ప్రవీణ్, రాజుగౌడ్, దౌల్తాబాద్ మండల డీలర్లు తుమ్మల లాలుయాదవ్, నాగప్ప, రైతులు కంపెనీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీ నియామకం



నియామకపత్రాలు అందుకుంటున్న సభ్యులు

సిద్దిపేటరూరల్, ఏప్రిల్ 25: సిద్దిపేట రూరల్ మండలంలోని రాఘవాపూర్ గ్రామంలో ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు గ్యార రఘుపతి ఆధ్వర్యంలో కాంగ్రెస్ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పిట్ల వెంకటి, ఉపాధ్యక్షుడిగా గ్యార బాబు, ప్రధాన కార్యదర్శిగా తాడేపు లింగం, కార్యదర్శులుగా గొడుగు రామచంద్రం, సుర శ్రీనివాస్, సలహాదారులుగా బండి కనకయ్య, తాడేపు మురళి, కార్యవర్గ సభ్యులుగా మిట్టపల్లి రాజయ్య, క్యాతం చంద్రయ్య, గొడుగు బాలరాజ్, డప్పు యాదయ్యలు ఎన్నుకున్నారు. కాంగ్రెస్ రూరల్ మండల అధ్యక్షుడు గరిపల్లి రాములు, జిల్లా నాయకుడు మంద పండులు నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదరి బండి శివకుమార్, నాయకులు సంయోద్దీన్, పుల్లూరు కనకయ్య, సంపంగి బుగ్గరాజు, అనపురం మహేష్, సంపంగి శేఖర్, గ్యార లింగం, కనకరెడ్డి, మిద్దె స్వామి, శ్రీరాములు, శ్రీనివాస్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆ రెండు గ్రామాలకు ప్రత్యేక అధికారి కరువు

● ప్రత్యేక అధికారి ఉద్యోగ విరమణ

● నెలలు గడుస్తున్నా లేని నియామకం



పోతిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం

చేర్యాల, ఏప్రిల్ 25: చేర్యాల మండలం పెద్దరాజుపేట, పోతిరెడ్డిపల్లి గ్రామాలకు ప్రత్యేక అధికారి లేకపోవడంతో సమస్యలు పరిష్కారం కాక ప్రజలు ఇబ్బందులుపడుతున్నారు. సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. ఈక్రమంలో ఆయా గ్రామాలకు చేర్యాల ఎంఈవో మొగుళ్ల నర్సింహారెడ్డిని నియమించగా, ఆయన మార్చి 31వతేదీన ఉద్యోగ విరమణ చేశారు. మూడువారాలు గడిచినా ఆయన స్థానంలో మరో అధికారిని నియమించలేదు. పంచాయతీ కార్యదర్శులున్నా ప్రత్యేక అధికారి లేకపోవడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. అంతేకాకుండా ప్రతీ సోమవారం, గురువారం విధిగా గ్రామంలో అందుబాటులో ఉండాలన్న నిబంధన కూడా ఉంది. కానీ ప్రత్యేక అదిధికారి లేకపోవడంతో ఆయా పనుల నిమిత్తం ప్రజలు తిరిగి తాజా మాజీ సర్పంచులు, ప్రజాప్రతినిధులను ఆశ్రయిస్తున్నారు.

వెంటనే నియమించాలి

గతంలో పనిచేసిన గ్రామపంచాయతీ కార్యదర్శి నిధుల అవకతవకలకు పాల్పడటంతో ఫిర్యాదు చేసిన తరువాత కొంతమేర డబ్బులు తిరిగి చెల్లించింది. కానీ ప్రస్తుతం ప్రత్యేక అధికారి లేకపోవడం వల్ల నిధులు పక్కదోవ పట్టే అవకాశం లేకపోలేదు. అధికారులు స్పందించి వెంటనే ప్రత్యేక అధికారిని నియమించాలి.

\- కత్తుల భాస్కర్‌రెడ్డి, పోతిరెడ్డిపల్లి

ప్రతిపాదనలు పంపించాం

ఎంఈవో నర్సింహరెడ్డి ఉద్యోగ విరమణ చేయడంతో ఆయన స్థానంలో హార్టికల్చర్ అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించాలని కోరుతూ, కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపించాం. నియామకమయ్యేంత వరకు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక శ్రద్ధతో పర్యవేక్షిస్తాం.

\- మహబూబ్ అలీ, ఇన్‌చార్జి ఎంపీడీవో

భువనగిరి రోడ్‌షోకు తరలిన బీఆర్‌ఎస్ శ్రేణులు



చేర్యాల: కొమురవెల్లి నుంచి బయలుదేరిన బీఆర్‌ఎస్ నాయకులు

చేర్యాల/మద్దూరు ఏప్రిల్ 25: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ చేపట్టిన బస్సుయాత్రలో భాగంగా బుధవారం సాయంత్రం భువనగిరి జిల్లాకేంద్రంలో నిర్వహించిన రోడ్ షోకు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేర్యాల, కొమురవెల్లి మండలాల గులాబీ నాయకులు భారీగా తరలివెళ్లారు.

కొమురవెల్లిలో బస్సు కిటికీ అద్దం ధ్వంసం

పార్టీశ్రేణుల సమీకరణ నిమిత్తం కొమురవెల్లి గ్రామానికి ఓ బస్సు చేరుకున్న క్రమంలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రాయి విసిరి అద్దం పగలగొట్టాడు. ఈ విషయమై బీఆర్‌ఎస్ నాయకులు గమనించి ఆ వ్యక్తిని గీస ప్రభాకర్‌గా గుర్తించారు. ఈ విషయాన్ని పోలీసులకు తెలపడంతో సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. మాజీ సీఎం కేసీఆర్ భువనగిరిలో నిర్వహించిన రోడ్‌షోకు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మేక సంతోష్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు గురువారం భారీగా తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో బెల్లు చంద్రమౌళి, నలుసాని లింగారెడ్డి, మాజీ ఎంపీపీ బెల్లపు యాదయ్యతో పాటు పలువురు ఉన్నారు.



మద్దూరు: భువనగిరి రోడ్‌షోకు తరలివెళ్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

బీఆర్‌ఎస్‌పై రఘునందన్‌రావు విమర్శలు అర్ధరహితం

● సిద్దిపేట బీఆర్‌ఎస్ నాయకులు



సిద్దిపేటలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 25: ప్రాజెక్టుల నిర్మాణం విషయంలో దేశంలో మెరుగ్గా నష్టపరిహారం ఇచ్చింది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని ఆ పార్టీ నాయకులు స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లాలో ముంపు బాధితులకు పరిహారం సరిగ్గా ఇవ్వలేదని బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు చేసిన వ్యాఖ్యలు అర్థ రహితమన్నారు. గురువారం సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే హరీశ్‌రావు నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పాల సాయిరాం, సీనియర్ నాయకులు భుపేష్, రాములులు మాట్లాడుతూ.. భూసేకరణ చట్టం నిబంధనల మేరకు సిద్దిపేట జిల్లాలో బాధితులకు మెరుగైన ప్యాకేజీ ఇచ్చారని, అవగాహన లేక విమర్శలు చేయొద్దని సూచించారు. గతంలో సింగూరు ముంపు బాధితులకు నష్ట పరిహారం అందక కోర్టుల చుట్టూ తిరిగిన విషయాన్ని గుర్తు చేశారు. దుబ్బాక ఎమ్మెల్యేగా ఉన్న రోజుల్లో రఘునందన్‌రావు ఎందుకు పరిహారం గురించి మాట్లాడలేదని ప్రశ్నించారు. సిద్దిపేటకు రైలు 40 ఏళ్ల కల అని, దాన్ని మాజీ సీఎం కేసీఆర్ హయాంలో సాధించిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. హరీశ్‌రావు ప్రత్యేక చొరవ, తెలంగాణ ప్రభుత్వం నిధులు, భూమి కేటాయింపు తదితర అంశాలపై రైలు వచ్చిందని వివరించారు. సమావేశంలో సీనియర్ నాయకులు లోక లక్ష్మీరాజ్యం, నముండ్ల రాంచంద్రం, ఎర్ర యాదయ్య, కనకయ్య, రాంచంద్రం, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

యువతిని సఖీ కేంద్రంలో చేర్పించిన ఉపాధ్యాయురాలు



యువతిని తరలిస్తున్న ఉపాధ్యాయురాలు సౌజన్య

గజ్వేల్, ఏప్రిల్ 25: మతిస్థిమితం కోల్పోయి అచేతనంగా పడి ఉన్న యువతిని గజ్వేల్ పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయని అన్నవెల్లి సౌజన్య చేరదీసి గజ్వేల్ ఆస్పత్రికి తరలించారు. పట్టణంలోని ముట్రాజ్‌పల్లి రోడ్డులో అచేతనంగా పడి ఉన్న యువతిని గజ్వేల్ పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ సుభాష్ చంద్రబోస్, ఫుట్‌బాల్ కోచ్ నర్సింహులు సహకారంతో ఉపాధ్యాయని సౌజన్య ఆమెకు అల్పాహారం అందజేసి, గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ఎండ తీవ్రత, ఆహారం లేక డీహైడ్రేషన్‌కు గురికావడంతో సదరు యువతి మాట్లాడలేకపోతున్నదని వైద్యులు తెలిపారు. అనంతరం సిద్దిపేటలోని సఖీ కేంద్రానికి సమాచారం అందించి, సఖీ కేంద్రం సభ్యులకు ఆ యువతిని అప్పగించారు.

కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలి

● సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య

గజ్వేల్, ఏప్రిల్ 25: సిద్దిపేట జిల్లాలో నాలుగు నెలలుగా బకాయిపడిన గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ కార్మికులు 100కి 99శాతం మంది దళిత కుటుంబాలకు చెందిన వారేనని, వారి జీవితాలను త్యాగం చేస్తూ ప్రజల కోసం పనిచేస్తున్న కార్మికులకు కనీసం సమయానికి వేతనాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. అనేక సందర్భాల్లో జిల్లా కలెక్టర్, జిల్లా స్థాయి అధికారులకు వినతిపత్రాలను అందజేసినా, కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాలు, పికెటింగ్‌లు చేపట్టినా జిల్లాలో వేతనాలు పడడం లేదన్నారు. ఎన్నికల పేరుతో కాలయాపన చేస్తూ కార్మికులను పస్తులు ఉంచుతున్నారన్నారు. వెంటనే గ్రామపంచాయతీ కార్మికులకు బకాయిపడిన వేతనాలను చెల్లించాలని, లేని పక్షంలో మెరుపు సమ్మెకు దిగుతామని హెచ్చరించారు.

'పిల్లల వికాసానికి యోగ అద్భుతశాస్త్రం'

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 25: బాల్యంలోనే పిల్లల్లోని సృజనాత్మకతను వెలికితీస్తే వారు అద్భుత శక్తులుగా మారుతారని వైద్యుడు భాస్కర్ అన్నారు. గురువారం సిద్దిపేట పట్టణంలోని సిద్దిపేట వ్యాస మహర్షి యోగా కేంద్రంలో బాల సంస్కార్ వేసవి శిక్షణా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగా, ప్రాణాయామం, ధ్యానం వైద్యశాస్త్రంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సెలవులను సద్వినియోగపరిచి, పిల్లల మానసిక, శారీరక వికాసానికి తోడ్పాటు అందించాలని సూచించారు. సమావేశంలో వ్యాస మహర్షి యోగ సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, యోగశిక్షకులు తోట సతీష్, సంధ్య, కే .అంజయ్య తోట అశోక్, విక్రంరెడ్డి, గంగపురం శ్రీనివాస్, బసవరాజ్ రాజ్‌కుమార్, రవికుమార్, యాదగిరి, అనిల్, విజయలక్ష్మి, సిందూరి, మనీషా పాల్గొన్నారు.

బ్యాలెట్ విధానంతో ఎన్నికలు నిర్వహించాలి

● ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు పుర్ర ప్రభాకర్ మాదిగ

కొల్చారం, ఏప్రిల్ 25: ఈవీఎంలు కాకుండా బ్యాలెట్ విధానంతో ఎన్నికలు జరిపించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు పుర్ర ప్రభాకర్ మాదిగ డిమాండ్ చేశారు. మెదక్ జిల్లా కొల్చారం మండలం సంగాయిపేటలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. దేశంలో సబ్బండ వర్గాల కోసం బాబాసాహెబ్ అంబేద్కర్ గొప్ప చదువులు చదివి, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ, ఓసీలందరికీ రిజర్వేషన్లు కల్పించాడన్నారు. మాదిగ, మాదిగ ఉపకులాల ఓట్లను ఏబీసీడీ వర్గీకరణ పేరుతో కొల్లగొట్టాలని ప్రధాని మోదీ చూస్తున్నారని విమర్శించారు. మాదిగల శక్తికి పాతాళలోకం పోవాల్సిందే అని ప్రధానిని హెచ్చరించారు. రాజ్యాంగం మారిస్తే తప్పేంటి అన్న గజేంద్రసింగ్‌కు రాజకీయ భవిష్యత్తు ఉండదన్నారు. మాదిగలు బీజేపీకి ఓటు వేయవద్దని కోరారు.

సిద్దిపేట జిల్లా సెషన్ న్యాయాధికారి పూజలు



ధర్మపురి ఆలయం వద్ద న్యాయాధికారి రఘురాం దంపతులు

ధర్మపురి, ఏప్రిల్ 25: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని, కొండగట్టు అంజనేయస్వామి ఆలయాన్ని సిద్దిపేట జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్ న్యాయాధికారి రఘురాం కుటుంబ సమేతంగా గురువారం సందర్శించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అవగాహనతో మలేరియా నిర్మూలన

● హెల్త్ సూపర్‌వైజర్ స్వామి

నంగునూరు, ఏప్రిల్ 25: అవగాహనతోనే మలేరియా వ్యాధిని నిర్మూలించవచ్చని హెల్త్ సూపర్‌వైజర్ స్వామి అన్నారు. గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా నంగునూరు మండలం రాజగోపాలపేటలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మలేరియా అవగాహన ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. ఎప్పటికప్పుడు పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దోమల వల్ల అనేక వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రై డే పాటిస్తే మలేరియా రాదని తెలిపారు. జ్వరం వస్తే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తపరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా రక్త పరీక్షలు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో మహిళా సూపర్‌వైజర్ అనురాధ, నర్సింగ్ ఆఫీసర్లు, పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



నంగునూరు: మండలంలోని రాజగోపాల్‌పేటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



గజ్వేల్: పట్టణంలోని జిల్లా ఆస్పత్రిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

● గజ్వేల్: దోమలను అరికడితేనే ఆరోగ్య సమాజం నిర్మితమవుతుందని గజ్వేల్ సబ్ యూనిట్ అధికారి బి.శ్రీనివాస్ అన్నారు. గజ్వేల్ పట్టణంలోని జిల్లా ఆస్పత్రిలో గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మలేరియాపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మురికికాలువలను శుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిలువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమల నివారణకు ప్రత్యేక శద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో రాఖేశ్, సంధ్య, అరుణ, స్టాఫ్ నర్సులు సుగంధ, దివ్య, రష్మీ, అరుణ, హెల్త్ అసిస్టెంట్ వాసుదేవ్, జోసెఫ్, పాండు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఆశావర్కర్లు ఉన్నారు.

మెప్పు కోసం ఫొటోలు

మద్దూరు, ఏప్రిల్ 25: ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని పీహెచ్‌సీల ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కలిపించాల్సి ఉంది. కానీ సిబ్బంది కేవలం అధికారుల మెప్పు కోసం ఫొటో దిగడం శోచనీయంగా మారింది. మద్దూరులో కేవలం హెల్త్ అసిస్టెంట్, ఏఎన్ఎం, ఫార్మాసిస్ట్, స్టాఫ్‌నర్సు విధులకు హాజరయ్యారు. ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం సమీపంలో ర్యాలీ నిర్వహించినట్లు ఫొటో దిగారు. ఆలస్యంగా విధులకు హాజరైన మరికొంతమంది మమ్మల్ని కాదని మీరెలా ఫొటో దిగుతారని వాగ్వాదానికి దిగి మరోసారి ర్యాలీ నిర్వహించినట్లు ఆస్పత్రి ఎదుట ఫొటోలు దిగడం చర్చనీయాంశంగా మారింది.

కంకర వేశారు.. రోడ్డు మరిచారు



కంకర వేసి వదిలేసిన ఈదులపల్లి రోడ్డు

ఝరా సంగం, ఏప్రిల్ 25: మండల పరిధిలోని ఈదులపల్లి నుంచి దిగ్వాల్ వైపు వెళ్లే తారు రోడ్డు మరమ్మతంలో భాగంగా కాంట్రాక్టర్ కంకర వేసి వదిలేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రోడ్డు గుండా లారీలు, కారులు వెళ్లినప్పుడు వెనక వచ్చే వాహనదారుల కళ్లల్లో దుమ్మూ ధూళీ పడి ఇబ్బందులు పడుతున్నారు. ఝరాసంగం, మేదపల్లి. ఈదులపల్లి, దేవరంపల్లి గ్రామాలకు చెందిన వాహనదారులు సంగారెడ్డి, హైదారాబాద్ పట్టణాలకు ఈ రోడ్డు గుండా వెళ్తుంటారు. రద్దీగా ఉండే రోడ్డుపై కంకర వేయడంతో ద్విచక్రవాహనలు అదుపుతప్పి కింద పడుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కంకర వేసిన రోడ్డును పూర్తి చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.